# తెలుసుకోదగిన ముఖ్య విషయాలు

1. **రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ :** డిఎస్సి చే సెలక్టు చేయబడిన ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ వారి నియామకము తేదీ నుండి చేయబడుతుంది. పోలీసు యాంటిసిడెంట్స్ రిపోర్టు సకాలంలో రాని కారణంగా రెగ్యులరైజేషన్‌కు పెద్ద ఆటంకంగా వున్నది. రెగ్యులరైజేషన్ తేదీ నుండి మాత్రమే సీనియార్టీ పరిగణించబడుతుంది. రెగ్యులర్ సర్వీసు రెండు సంవత్సరాలు పూర్తయిన తరువాత ప్రొబేషన్ డిక్లరేషన్ చేయబడుతుంది. లోయరు క్యాడరులో రెగ్యులరైజేషన్ అయిన తదుపరి ప్రమోషన్ పొందితే ప్రత్యేకంగా రెగ్యులరైజేషన్‌తో పని లేకుండా సంవత్సరం సర్వీసు పూర్తయిన తరువాత ప్రొబేషన్ డిక్లరేషన్ చేయబడుతుంది. ప్రొబేషన్ డిక్లరేషన్ సకాలంలో చేయబడనప్పుడు డిక్లరేషన్ జరిగినట్లుగానే భావించబడుతుంది.
2. **స్టెప్పింగ్ అప్ ఆఫ్ పే :** సీనియరు - జూనియరు వేతన వ్యత్యాసము ఎఫ్ఆర్ 27 క్రింద సవరించ బడుతుంది. అయితే అట్టి వేతన వ్యత్యాసమునకు వ్యక్తిగత ప్రత్యేకతలు కారణమై వుండరాదు. 10/15 సంవత్సరముల స్కేళ్ళను పొందిన తదుపరి ప్రమోషను పొందిన జూనియర్‌కంటే, సదరు స్కేళ్ళను పొందకుండానే ప్రమోషన్ పొందిన సీనియరు తక్కువ వేతనము పొందుతుంటే (జిఓ 297 ఆర్థిక, తేది. 25.10.1983 ననుసరించి) అట్టి సీనియరు వేతనమును జూనియరు వేతనముతో సమాన పరచుచూ స్టెప్పింగ్ అప్ చేస్తారు. అట్టే 10/15/22 సంవత్సరముల స్కేళ్ళను పొంది క్రింది పోస్టులోనే కొనసాగుతున్న జూనియర్ కంటే, సదరు స్కేళ్ళను పొందకమునుపే ప్రమోషను పొందిన సీనియరు తక్కువ వేతనము పొందుతుంటే వారి వేతనమును కూడా (జిఓ 75 ఆర్థిక, తేది. 22.02.1994 ననుసరించి) స్టెప్పింగ్ అప్ చేస్తారు. 2010 వేతన స్కేళ్లల్లో స్టెప్-అప్ సౌకర్యం పునరుద్ధరించబడినది. జిఓ 52 ఆర్థిక, తేది. 25.02.2010 ప్రకారం పై కారణాలరీత్యా 01.07.2008 నాటికి సీనియరు కంటే జూనియర్ ఎక్కువ వేతనం పొందుచున్న ఎడల ముందు స్టెప్ అప్ చేసి తదుపరి 2010 స్కేళ్లల్లో వేతన నిర్ణయం చేయాలి. జిఓ నం. 93 ఆర్థిక, తేది. 04.03.2010 ప్రకారం 2010 పీఆర్‌సీ అమలు తర్వాత సీనియర్, జూనియర్ స్కేళ్లలో వచ్చిన వేతన వ్యత్యాసము పైన ఉదహరించిన కారణాలరీత్యా ఉన్నట్లయితే దానిని జూనియర్ వేతనము ఎక్కువగా నిర్ణయించబడిన రోజు నుండి సీనియర్ వేతనం సమానం చేయబడును.
3. **ప్రీ పోన్మెంట్ :** 2010 వేతన స్కేళ్ళలో ప్రీపోన్మెంట్ సౌకర్యం పునరుద్ధరించబడినది. జిఓ.ఎంఎస్.నం. 52 ఆర్థిక, తేది. 25.02.2010 ప్రకారం 01.07.2008కి ముందు జూనియర్ వేతనము, సీనియర్ వేతనం కన్నా తక్కువగా ఉండి 2010 వేతన స్కేళ్ళలో ఇరువురికి వేతనం ఒకే స్టేజి వద్ద వేతన స్థిరీకరణ జరిగి జూనియర్ ఇంక్రిమెంట్ తేదీ ముందుగా ఉన్నప్పుడు సీనియర్ ఇంక్రిమెంట్ తేదీని కూడా జూనియర్ ఇంక్రిమెంట్ తేదీకి ప్రీపోన్ చేస్తారు.
4. **స్వస్థలము నమోదు :** సర్వీసు రిజిష్టరు రెండవ పేజీలో నమోదు వున్న నివాస స్థలమును బదిలీల సందర్భంలో స్వస్థలము (Native Place) పరిగణించుట వలన అనేకమంది నష్టపోవుట జరుగుచున్నది. ఈ స్థితిలో ఎల్‌టిసి వినియోగ సందర్భములో స్వస్థలము (Home Town)ను నమోదు చేయుటకు జిఓ 248 ఆర్థిక, తేది. 20.09.1982 (అ.ద. 8 పేజి 168)లో పేర్కొనిన విధానముచే ఉపాధ్యాయుల బదిలీల సందర్భములో స్వస్థలమును నమోదు చేయుటలోను పాటించవలసినదిగా పాఠశాల విద్యాసంచాలకులవారి ఉత్తర్వులు ఆర్‌సి.నం. 6371/సి2-1/2001, తేది. 06.11.2001 ద్వారా వివరణ ఇవ్వబడినది. అట్లే ప్రభుత్వ మెమో నం. 59852/ఎస్టా-VIII/87-1 పీఆర్‌సీ & ఆర్‌డి శాఖ, తేది. 31.07.1987ననుసరించి మహిళా ఉపాధ్యాయిని తన తల్లిదండ్రుల యొక్క లేక భర్త యొక్క స్వస్థలములలో ఏదొక దానిని తన స్వస్థలముగా ప్రకటించుకొనవచ్చునని కూడా పాఠశాల విద్యా సంచాలకుల వారి ఉత్తర్వులు ఆర్‌సి.నం. 6585/సి2-2/2001, తేది. 13.10.2001 ద్వారా వివరణ ఇవ్వబడియున్నది.
5. **అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ / హైకోర్టు :** ప్రభుత్వోద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకై "అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం-1985" ననుసరించి ఏర్పాటైన క్రొత్త ట్రిబ్యునల్ 1989 నవంబరు 1 నుండి పనిచేస్తున్నది. కనుక "కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అర్జీ" ద్వారా ఉద్యోగులు దాని తీర్పులను అమలు జరిపించుకోవచ్చు. అట్లే దాని తీర్పు నచ్చనప్పుడు హైకోర్టులో అప్పీలు చేసుకోనవచ్చును. ఎయిడెడ్ విద్యా సంస్థలు, అటానమస్ బాడీలకు చెందిన ఉద్యోగులు తమ పిటీషన్లను నేరుగా హైకోర్టులో మాత్రమే దాఖలు చేసుకోవాలి.

6. **వివిధ రకాల అలవెన్సులు :**

1) **డ్యూటీ అలవెన్సు :** ప్రధానోపాధ్యాయుల విధులను నిర్వహించినందులకు హెచ్ఎం అలవెన్సుగా పిలువబడే స్పెషల్ పే పాఠశాల స్థాయినిబట్టి యివ్వబడుతుంది. 2010 స్కేళ్ళ ప్రకారం ఏకోపాధ్యాయుడయితే రూ. 50/–లు, బహుళోపాధ్యాయ ప్రాథమిక పాఠశాల అయితే రూ. 75/–లు, ప్రాథమికోన్నత పాఠశాల అయితే రూ. 100/–లు చొప్పున చెల్లించబడుతుంది. కాగా హెచ్ఎం పోస్టు వున్న ఉన్నత పాఠశాలకు ఎఫ్ఏసిగా పనిచేస్తే ఎఫ్ఆర్ 49 ననుసరించి అడిషనల్ చార్జ్ అలవెన్సు యివ్వబడుతుంది. అది హెచ్ఎం పోస్టు యొక్క స్కేలు మినిమంలో 1/5 వంతున 3 నెలలు, 1/10 వంతున ఆ తదుపరి 3 నెలలు చెల్లించబడుతుంది. దానిపై డిఏ, హెచ్ఆర్ఏ కూడా అనుమతించబడతాయి. జిఓ నెం. 118 ఆర్థిక, తేది:7.4.2010.

2) **కన్వేయన్సు అలవెన్సు :** అంగవైకల్యము గలవారికి, గ్రుడ్డివారికి మూలవేతనములో 10% చొప్పున రూ. 900/–ల గరిష్ఠ పరిమితితో ప్రయాణ ఖర్చుల క్రింద చెల్లించబడుతుంది. 40% శాశ్వతమైన పాక్షిక అంగవైకల్యం గలవారు అర్హులు. ప్రభుత్వ సివిల్ సర్జను నుండి వైద్య ధృవపత్రమును పొందాలి. అట్టి వైద్య ధృవపత్రము కార్యాలయాధిపతికి చేరిన తేదీ నుండి యీ అలవెన్సు చెల్లించబడుతుంది. క్యాజువల్ సెలవులుగాక యితర సెలవుల కాలము, జాయినింగు కాలము, సస్పెన్షన్ కాలములకు యిది చెల్లించబడదు. జిఓ నెం. 108 ఆర్థిక, తేది:7.4.2010.

3) **రీడర్స్ అలవెన్సు :** గ్రుడ్డివారైన ఉపాధ్యాయులు బోధించుటలో సహాయకునికి రీడర్ అలవెన్సు సెకండరీ గ్రేడ్ వారికైతే రూ. 400/–లు, స్కూల్ అసిస్టెంట్లకైతే రూ. 500/–లు నెలకు చెల్లించబడుతుంది. జిఓ 34, మ&బా.స, తేది:16.7.2010.

4) **హైయ్యర్ క్లాసు అలవెన్సు :** క్యాటగిరీ IIIకి చెందిన ఉపాధ్యాయులు 8,9,10 తరగతులకు బోధించినందులకు నెలకు రూ. 100/–ల చొప్పున చెల్లిస్తారు. అయితే అందుకు తనిఖీ అధికారి ముందస్తు అనుమతి అవసరము. జిఓ నెం. 118, ఆర్థిక, తేది: 7.4.2010.

5) **స్కౌట్, ఎన్‌సిసి అలవెన్సు :** నెలకు రూ. 75/–ల చొప్పున చెల్లించబడుతుంది. జిఓ 133 ఆర్థిక, తేది: 24.4.2010.

6) **హెచ్ఆర్ఏ :** హెచ్ఆర్ఏ గరిష్ఠ పరిమితి 01.02.2010 నుండి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 6,000/– నుండి 12,000/–లకు ఇతర ప్రాంతాలలో రూ. 4,000/–ల నుండి రూ. 8,000/–లకు పెంపుదల చేశారు. జిఓ 64 ఆర్థిక, తేది: 9.3.2010

7) **విద్యా రాయితీ :** ఉద్యోగులు తమ పిల్లలు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఎల్.కె.జి. నుండి ఇంటర్ వరకు చదువుచున్నచో ఒక్కొక్కరికి రూ. 1000/–ల వంతున ఇద్దరు పిల్లల వరకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుటకు అర్హులు. 2010 పీఆర్‌సీ స్కేళ్లలో అందరు నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు అర్హులు.

## అప్పులు అడ్వాన్సులు

**పండుగ అడ్వాన్సు :** 2010 పీఆర్‌సీస్కేళ్ళలో 13,360–38,370 స్కేలుగాని, అంతకు తక్కువ స్కేలుగాని కలిగియున్న ఉద్యోగులకు రూ. 3000/–ల చొప్పునను, 4వ తరగతి ఉద్యోగులకు రూ. 2000/–ల చొప్పునను పండుగ అడ్వాన్సు మంజూరు చేయబడుతుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకసారి మాత్రమే, ప్రభుత్వ సెలవు దినముగా ప్రకటించబడిన పండుగకు యీ అడ్వాన్సు యివ్వబడుతుంది. అది 10 సమాన వాయిదాలలో రికవరీ చేయబడుతుంది. జిఓ 175 ఆర్థిక, తేది: 15.05.2010.

**వివాహ అడ్వాన్సు :** 2010 పీఆర్‌సీలో పురుష ఉద్యోగి వివాహమునకు లేక ఉద్యోగి కుమారుని వివాహమునకు రూ. 50,000 చొప్పునను, మహిళా ఉద్యోగి వివాహమునకు లేక ఉద్యోగి కుమార్తె వివాహమునకు రూ. 75,000లు చొప్పున వివాహ అడ్వాన్సు మంజూరు చేయబడుతుంది. 4వ తరగతి ఉద్యోగులైతే పురుషులకు రూ. 30,000, స్త్రీలకు రూ. 50,000 మంజూరు చేయబడుతుంది. అడ్వాన్సు మొత్తం 70 వాయిదాలలోను, వడ్డీ 10 వాయిదాలలోను రికవరీ చేయబడుతుంది. వడ్డీ రేటు 4వ తరగతి ఉద్యోగులకు 5%, ఇతరులకు 5.5%గాను ఉంటుంది.

**విద్యా అడ్వాన్సు :** 2010 పీఆర్‌సీ స్కేళ్ళలో ఉద్యోగులకు రూ. 5000/–ల చొప్పున మంజూరు చేయబడుతుంది. కనీసం 2 సంాల సర్వీసు గల రెగ్యులర్ ఉద్యోగులు అర్హులు. తమ పిల్లల విద్యా ఫీజుకై మరియు పాఠ్య పుస్తకముల కొనుగోలు నిమిత్తం యీ అడ్వాన్సు కొరకు నిర్ణీత ఫారంలో దరఖాస్తు చేయాలి.

**గమనిక :** ఉద్యోగి మరణించిన సందర్భంలో పై 3 రకాల అడ్వాన్సుల తాలూకు రికవరీలు రద్దు చేయబడతాయి.